మంత్రిని కలిసిన అర్చకులు



కుత్బుల్లాపూర్ : దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను నియోజకవర్గ వేణుగోపాలస్వామి ఆలయ అర్చకులు మధుసూదనాచార్యులు, రామానుజాచార్యుల ఆధ్వర్యంలో మంగళవారం కలిసి సమస్యలు వివరించారు. సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారని వారు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆరోగ్య భద్రత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కునందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సీఎం సహాయనిధితో పేదలకు ఆరోగ్య భద్రత లభిస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ హెచ్‌ఏఎల్ కాలనీలకు చెందిన బుట్టికి రూ.50 వేలు, సంపూర్ణకు రూ.1.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను క్యాంప్ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. అర్హులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



మాజీ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌ను కలిసిన భాగ్యలక్ష్మి కాలనీ నూతన కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మాజీ డీసీసీ అధ్యక్షుడు కె.ఎం.ప్రతాప్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ భాగ్యలక్ష్మి కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు యాదగిరియాదవ్, ప్రధాన కార్యదర్శి నందంగౌడ్, కార్యవర్గ సభ్యులు హరిబాబు, రాజు, సుందరయ్య, శంకర్‌చారి, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన బస్సులు ప్రారంభం

జీడిమెట్ల: జీడిమెట్ల డిపో నుంచి కొత్త డిలక్స్ బస్సులను మంగళవారం డిపో మేనేజర్ ఆంజనేయులు ప్రారంభించారు. రెండు డిలక్స్ బస్సులను అపురూప కాలనీ నుంచి మెహిదీపట్నం వరకు, మరో రెండు బస్సులను సీబీఎస్ నుంచి గండిమైసమ్మ వరకు నడపనున్నామని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రయాణికులకు సూచించారు.

అవయవదానంపై అవగాహన

చింతల్: చింతల్ డివిజన్ గణేష్‌నగర్‌లోని భాగ్యరాధి డిగ్రీ కాలేజీలో అవయవదానంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అమ్మ ఐ అండ్ అవయవ దాతల ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, మా సంస్థ ప్రధాన సలహాదారు సుబ్బరాజు మాట్లాడారు. అవయవదానంతో ఆపదలో ఉన్న వ్యక్తుల ప్రాణాలు కాపాడిన వారవుతామన్నారు. ప్రతి ఒక్కరూ అవయవదానంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రావుల వరప్రసాద్, గంజి ఈశ్వరలింగం తదితరులు పాల్గొన్నారు.



అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న అమ్మ ఐ అండ్ అవయవదాతల సంఘం సభ్యులు

రోగులకు టెలీమెడిసిన్

• పేదలకు ప్రత్యేక వైద్యసేవలు • ప్రయోజనం పొందుతున్న రోగులు

- మల్కాజిగిరి ఆసుపత్రితో సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల అనుసంధానం
- ఉస్మానియా, గాంధీ, నిమ్స్ నుంచి కూడా రోగులకు సేవలు



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ వైద్యరంగంలో ప్రవేశపెట్టిన టెలీ మెడిసిన్ విధానంతో ప్రత్యేక వైద్యసేవలు బస్తీ, పల్లెవాసుల దరి చేరాయి. వైద్యులు టీవీ, కంప్యూటర్ విధానంలో రోగులను పరిశీలించి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వచ్చే అల్పాదాయ వర్గాలకు ఇది వరం. మల్కాజిగిరిలోని జిల్లా ఆసుపత్రితో రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 12 సీహెచ్‌సీలు, 24 యూపీహెచ్‌సీలు అనుసంధానం చేశారు. వీటి పరిధిలో ఇప్పటివరకు 26,436 మంది టెలీ మెడిసిన్ సేవలు పొందారు. జిల్లా వ్యాప్తంగా 24 యూపీహెచ్‌ఎస్, 4 పీహెచ్‌సీలు, ఒక ఏరియా ఆసుపత్రి, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అనుసంధానం చేశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా, నిమ్స్, గాంధీ ప్రభుత్వ ఆసుపత్రులకు మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని అనుసంధానం చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు చెందిన 40 ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల నుంచి కూడా రోగులు ఇక్కడి సేవలు పొందేలా ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లో టెలీ మెడిసిన్ సేవలు నిరంతరం కొనసాగుతున్నాయని జిల్లా వైద్యారోగ్య శాఖ డాక్టర్ రఘునాథ్‌స్వామి పేర్కొంటున్నారు.

సమన్వయంతో సేవలు

◆ అనారోగ్య సమస్యలతో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలను సంప్రదిస్తున్న బాధిత రోగులను అక్కడి వైద్యులు పరీక్షిస్తున్నారు. వారికి నిపుణుల సేవలు అవసరమైతే వెంటనే మల్కాజిగిరి జిల్లా ఆసుపత్రి టెలీ మెడిసిన్ వైద్యులను సంప్రదిస్తున్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రోగులకు వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారు. ప్రతీ రోజు ఉదయం 9 గంటల నుంచి పేర్లు నమోదు చేస్తూ మధ్యాహ్నం 2 గంటల వరకు సేవలందిస్తున్నారు. ప్రధాన ఆస్పత్రి నుంచి నేరుగా ప్రత్యేక వైద్యనిపుణులు టీవీ, కంప్యూటర్ ద్వారా పీహెచ్‌సీలకు అనుసంధానం చేసిన ట్యాబ్, టీవీ, కంప్యూటర్లో రోగితో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారు. తర్వాత స్థానిక వైద్యాధికారికి సలహాలు, సూచనలు అందిస్తూ చికిత్సలు అందిస్తున్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని రిఫర్ చేయాలని సూచిస్తున్నారు. ఇలా ప్రాణాంతక రోగాలను ప్రాథమిక దశలో నియంత్రిస్తున్నారు.

జిల్లాలో లేని సేవలకు హైదరాబాద్ నుంచి..

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అవకాశం లేని ఎండోక్రైనాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ, సైక్రియాటిక్ నెఫ్రాలజీ, ఆంకాలజీ, పల్మనాలజీ, సైకోథెరపీ విభాగాల నిపుణులు హైదరాబాద్‌లోని ఉస్మానియా, నిమ్స్, గాంధీ ఆస్పత్రుల నుంచి టెలీ మెడిసిన్ సేవలను అందిస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో టెలీమెడిసిన్ సేవలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఘట్కేసర్, మేడ్చల్ కమ్యూనిటీహెల్త్ సెంటర్లు, మూడు చింతలపల్లి, శామీర్‌పేట, కీసర, జవహర్‌నగర్, కుషాయిగూడ, శ్రీరంగ వరం, నారపల్లి, ఉప్పల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, బాలానగర్, అల్వాల్ పీహెచ్‌సీలతోపాటు మచ్చబొల్లారం, సుభాష్‌నగర్, పర్వతానగర్, మూసాపేట్, జగద్గిరిగుట్ట, ఎల్లమ్మబండ హంసపేట్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, షాపూర్‌నగర్, గాజులరామారం సూరారం కాలనీ, వినాయకనగర్, ఏకలవ్య నగర్, మౌలాలీ, సఫిల్‌గూడ, మల్లాపూర్, వెంకట్‌రెడ్డి నగర్, నాగోల్, కొత్తపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ, చర్లపల్లి, పేట్‌బషీరాబాద్ యూహెచ్‌సీలకు చెందిన రోగులు మల్కాజిగిరి జిల్లా ఆసుపత్రి సమన్వయంతో ప్రత్యేకసేవలను వినియోగించుకుంటున్నారు.

వైద్య నిపుణులతో రోజువారీ సేవలు

టెలీ మెడిసిన్ సేవలందించే వైద్యనిపుణులు వారంలో ఒకరోజు అందుబాటులో ఉండేలా షెడ్యూల్ రూపొందించారు.

సోమవారం	- డెర్మటాలజీ, గైనకాలజీ
మంగళవారం	- ఆప్తమాలజీ, ఈఎన్‌టీ
బుధవారం	- జనరల్, మెడిసిన్
గురువారం	- పీడియాట్రిక్, జనరల్ సర్జన్,గైనకాలజీ
శుక్రవారం	- గైనకాలజీ
శనివారం	- ఆర్థోపెడిక్

గంజాయి బ్యాచ్‌కు అడ్డుకట్టేది?

• అడ్డాగా హెచ్‌ఎంటీ కాలనీ • అడ్డువచ్చిన వారిపై దాడులు

కుత్బుల్లాపూర్ : గంజాయి బ్యాచ్ రెచ్చిపోతుంది.. మొన్న భగత్‌సింగ్ నగర్.. నిన్న మారుతీ నగర్.. నేడు గాంధీనగర్ వైన్ షాపు వద్ద గొడవకు దిగారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు హెచ్‌ఎంటీ ఖాళీ ప్రదేశంలో గంజాయి తాగి కంటికి కనిపించిన వారిని కొడుతూ గొడవకు దిగడం పరిపాటిగా మారింది. వీరిపై ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. వారి ఇంటి వద్దకు చేరి చుక్కలు చూపిస్తున్నారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ నగర్‌లో ఉన్న వైన్ షాపు వద్ద సోమవారం రాత్రి 9:30 నుంచి 10 గంటల మధ్య గొడవకు దిగి నానా హంగామా చేశారు. కౌంటర్ పై ఉన్న వ్యక్తిపై దాడి చేసి పరారయ్యారు. వీరిని పట్టుకునే ప్రయత్నం చేసిన వారిపై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి సీఐ మల్లేష్ దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి సమయాల్లో దుకాణాలు మూసి వేస్తున్న సమయంలో వచ్చి హంగామా చేయడం, బెదిరించి డబ్బులు గుంజుకోవడం జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అడ్డాగా హెచ్‌ఎంటీ కాలనీ!

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని హెచ్‌ఎంటీ కాలనీలో పోకిరీలు రెచ్చిపోతున్నారు. చిత్తుగా మద్యం, గంజాయి తాగి వాకింగ్ చేసే వారిపై దాడికి దిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు నిర్జీవ ప్రదేశం.. చుట్టూ చెట్లు ఉండడంతో దారిన పోయేవారు వీరి ఆగడాలను తప్పించుకుంటూ వెళ్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడికి దిగుతున్నారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్నా పోలీస్ పెట్రోలింగ్ లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా నిఘా ఏర్పాటు చేసి కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.



గాంధీనగర్‌లో ఓ వైన్ షాపు నిర్వాహకుడిపై దాడికి పాల్పడుతున్న గంజాయి బ్యాచ్(ఫైల్)

కట్టమైసమ్మ ఆలయం వద్ద అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ కట్టమైసమ్మ ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని జనార్ధన్‌రెడ్డి, అతడి కుమారులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్‌రెడ్డి, శైలజ దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి తొమ్మిది రోజుల పాటు పూజా కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

వృద్ధురాలి అదృశ్యం



మణెమ్మ

జీడిమెట్ల: ఇంటి నుంచి బయటకెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బాలాజీ లే అవుట్‌లో నివాసముండే బుచ్చిరెడ్డి భార్య మణెమ్మ(68) మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి నడుచుకుంటూ బయటకు వెళ్లింది. సాయంత్రమైన తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాకాహారంతో గుండె జబ్బుల నియంత్రణ



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

దుండిగల్: శాకాహారాన్ని తీసుకోవడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుందని, కొవ్వు కరగడంతో పాటు జీర్ణక్రియ మెరుగుపడుతుందని యునైటెడ్ వెజిటేరియన్స్ ఫోరం అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ శాకాహార దినోత్సవాన్ని పురస్కరించుకుని బౌరంపేటలోని ఓక్రిడ్జ్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రొటీన్, ఐరన్, విటమిన్ బి–12 వంటి అవసరమైన పోషకాలు శాఖాహారంతో లభిస్తాయన్నారు. వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ, జంతు సంరక్షణ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రోత్సవాలకు సిద్ధం



విద్యుత్ దీపాలతో అలంకరించిన నిర్వాహకులు

సుభాష్‌నగర్: దసరా పండుగ శరన్నవ రాత్రి ఉత్సవాలకు కాలనీలో ఆలయాల వద్ద మండపాలను సిద్ధం చేశారు. తొమ్మిది రోజులపాటు ఆయా ప్రతి రూపాల్లో అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కాలనీ, బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ ల ఆధ్వర్యంలో ఆలయాలు, మండపాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ హనుమంతరావు, సింగర్ ఉష, కళాశాల చైర్మన్ సత్యనారాయణ, హేమలత

రంగారెడ్డినగర్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు అన్నారు. క్యాపిటల్ విద్యా సంస్థల ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం జీడిమెట్ల, హెచ్ఏఎల్ కాలనిలోని న్యూసిటీ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, ప్రత్యేక అతిథిగా ఇండియన్ ప్లేబ్యాక్ సింగర్ ఉష, గెస్ట్ ఆఫ్ హానర్‌గా ప్రైమ్ 9 న్యూస్ పొలిటికల్ అడ్వైజర్ సత్యనారాయణ, కళాశాలల చైర్మన్ డాక్టర్ దాయక సత్యనారాయణ, డైరెక్టర్ హేమలత పాల్గొన్నారు. షాపూర్‌నగర్, కొంపల్లి బ్రాంచ్‌ల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాటలతో గాయని ఉష విద్యార్థుల్లో జోష్ నింపారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

దాతల సేవలు అభినందనీయం

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: నియోజకవర్గ అభివృద్ధిలో దాతలు భాగస్వాములవ్వడం అభినందనీయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట పార్కులో మంగళవారం భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఆర్థిక సాయంతో సీఎస్ఆర్ ఫండ్ రూ.15.35 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను, పిల్లల కోసం ఏర్పాటు చేసిన పరికరాలను కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాంమోహన్, డైరెక్టర్ ఆఫ్ కమర్షియల్ ధనులతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజ హితం కోసం ఏదో ఒక రూపంలో సేవ చేయాలని కోరారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే పెద్దలు, వృద్ధులు, పిల్లలకు ఓపెన్‌జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మరిన్ని కాలనీల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసి, ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని అందించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

◆ వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని బాగ్అమీర్‌లో జీవీ హైట్స్ విశాల్ టవర్స్‌లోని పార్కులో భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ వారు సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ని ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఎండీ రాంమోహన్‌రావు, డైరెక్టర్ ఆఫ్ కమర్షియల్ ధనులతతో కలిసి ప్రారంభించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములవ్వాలని కోరారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



నందానగర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు



చింతల్ అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో..



ఎస్పీఆర్ గ్లోబెల్ స్కూల్‌లో..



జీడిమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



సూరారం నార్త్‌సిటీ హైస్కూల్‌లో..



దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో..

బతుకమ్మ వేడుకలు మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను పేర్చారు. అనంతరం బతుకమ్మలను నీటి కొలనులలో నిమజ్జనం చేశారు.

– కుత్బుల్లాపూర్